క్లుప్తంగా

నేటి నుంచి ఫిర్యాదుల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం సోమవారం నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్టు కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. గత మార్చి నెలలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి నిలిపివేసిన స్పందన కార్యక్రమం మళ్లీ ప్రారంభించనున్నట్టు తెలిపారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాలకు చెందిన అధికారులు అందరూ పాల్గొంటారని తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వైవీకే అప్పారావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల సమస్యల అర్జీలను స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులందరూ అందుబాటులో ఉంటారన్నారు.

గోరంట్లకు అభినందనలు



ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరిని ఆదివారం రాజమహేంద్రవరం అగ్నిమాపకాధికారి పి.శ్రీనివాసరావు, సిబ్బంది, పలువురు అధికారులు, టీడీపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనువులమ్మ తీర్థం

కడియం: స్థానిక శ్రీవనువులమ్మ వారి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా అమ్మవారి తీర్థ మహోత్సవంలో గ్రామంలోని ఆడపడచులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. శనివారం రాత్రి అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.

మాదక ద్రవ్యాల దుష్ఫలితాలపై అవగాహన



బాలుర వసతి గృహంలో అవగాహన కల్పిస్తున్న సెబ్ సబ్‌ఇన్‌స్పెక్టర్

ధవళేశ్వరం: స్థానిక బాలుర వసతి గృహంలో ఆదివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం–దుష్ఫలితాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెబ్ సౌత్‌స్టేషన్ ఎస్సైలు బి.శ్రీనివాసరావు, వై.దుర్గాప్రసాద్ మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. బాలుర వసతి గృహం వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజానగరం మండలం పల్లకడియం గ్రామంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ, సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గెడ్డం రామాయమ్మను అదుపులోకి తీసుకుని 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపారు.

నెమలి సింహాసనం సమర్పణ



నెమలి సింహాసనం ఇదే..

రాజానగరం: పురాతన ప్రసిద్ధి చెందిన స్థానిక రాజలింగేశ్వర, రాజగోపాలస్వామి వారి ఆలయానికి దేవతామూర్తులకు కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు వీలుగా చెక్కతో తయారు చేయించిన నెమలి సింహాసనాన్ని సమర్పించారు. రిటైర్డ్ హెచ్ఎం ఆర్ఎస్ వెంకట్రావు 92వ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు ఆర్.రామబ్రహ్మం, ఆర్‌వీవీఎస్ఎన్ మూర్తి ఆదివారం ఆలయ అర్చకులకు ఈ సింహాసనాన్ని అందజేశారు.



చిల్డ్రన్స్ పార్కు ముఖ ద్వారం



అంకెల పజిల్



గ్లోబ్



పెన్సిల్ వాల్

చిన్నారులకు నచ్చేలా.. విజ్ఞానం పెంచేలా..



జిగ్‌జాగ్ సైకిల్ ట్రాక్

- వినూత్నంగా తయారు చేసిన చిల్డ్రన్స్‌పార్క్
- రూ.1.98 కోట్లతో నిర్మాణం
- ప్రారంభోత్సవానికి సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ: చిన్నారులు బాగా ఇష్టపడేది పార్కులు. ఈ పార్కుల్లో ఆహ్లాదం, వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందించేలా సరికొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. పిల్లలకు నచ్చేలా వినూత్నంగా తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా), నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.కోటి 98 లక్షల వ్యయంతో పార్కును నిర్మిస్తున్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు జాతీయ రహదారి పక్కన భారత్ పెట్రోల్ బంకును అనుకుని ఉన్న ఈ స్థలంలో నగరపాలక సంస్థ చిన్నారులకు ప్రత్యేకంగా పార్కును సిద్ధం చేసింది.

పార్కులో అంశాలు

ఈ పార్కులో పర్యావరణ సమతుల్యాన్ని పాటిస్తూ అనేక ఆధునిక కార్యక్రమాలు చేపట్టింది. స్థానికులు అభ్యర్థన మేరకు జాతీయ దినోత్సవాలైన రిపబ్లిక్ డే, స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా ఆవిష్కరణకు జాతీయ జెండా స్థూపాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులకు సైకిల్ ట్రాక్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ జోన్, పెన్సిల్ వాల్, స్ప్రింగ్ టు గెదర్(తండ్రి కొడుకులు ఓకేసారి ఊగే ఊయల)చిన్నారులకు తల్లిపాలు అందించేందుకు మదర్ ఫీడింగ్ రూమ్, విజ్ఞానదాయక చిత్రాల ప్రదర్శనలకు అవసరమైన స్క్రీన్ అందుబాటులో ఉంచారు. సముద్రం ఒడ్డున ఉండే ఫీల్ కలిగించే బీచ్‌ను పోలిన ప్రదేశం(సేండ్ జోన్) తయారు చేశారు. పర్యావరణ హితంగా గ్రీనరీ, ప్రత్యేక ఆకర్షణగా మూడు ఆర్చీలు, స్టోరీ టెల్లింగ్ (చిన్నారులకు ఒక వ్యక్తి అక్కడి స్టోరీ చెప్పే విధంగా ఏర్పాటు), 50 లైట్లు (ఏ నుంచి జెడ్ వరకు తెలియజేసే లైట్లు) ఒకటి నుంచి 100 వరకు అంకెలు గల టేబుల్, పలు రకాల పజిల్స్, ప్రపంచాని తెలియజెప్పే గ్లోబ్, లూడో, చదరంగం, షేడ్ సిటింగ్, జిగ్ జాగ్ సిటింగ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు.



డ్రోన్ ద్వారా తీసిన పార్కు చిత్రం

త్వరలోనే అందుబాటులోకి..



నగర ప్రజలకు వినూత్న రీతిలో చిన్నారులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచేలా చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణం చేపట్టాం. త్వరలోనే నగర ప్రజలకు అందుబాటులోనికి రానుంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేనివిధంగా ఈ పార్కును సిద్ధం చేశాం. చిన్నారులు అడుగు పెడితే చాలు విజ్ఞానంతో బయటకు వెళ్లాలనే సంకల్పంతో ప్రత్యేకంగా తయారు చేశాం. వినూత్న తరహాలో పలు రకాల అంశాలను జోడించి సిద్ధం చేశాం. చిన్నారులను ఆటపాటల ద్వారా మరింతగా ఆకట్టుకునేలా పార్కు ఉంటుంది. ఒకసారి సందర్శించిన చిన్నారులు మళ్లీ మళ్లీ రావాలనే ఆలోచన కలుగుతుంది.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగర పాలక సంస్థ రాజమహేంద్రవరం

అమర్‌నాథ్ ఎందరికో స్ఫూర్తిదాయకం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి
- కబడ్డీ చాంపియన్ షిప్ నిర్వహిస్తాం : జక్కంపూడి గణేష్



అమర్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి, జక్కంపూడి గణేష్

ప్రకాశం నగర్: ప్రముఖ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు కుంపట్ల అమర్‌నాథ్ ఎందరికో స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీ వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాలులో కుంపట్ల అమర్‌నాథ్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, జక్కంపూడి గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజా మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు తన రాజకీయ ప్రస్థానంలో ఎటువంటి ఆర్థిక బలం లేనప్పటికీ స్నేహితుల ప్రోద్బలం సహకారంతోనే అంచెలంచెలుగా రాజకీయాల్లో ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. తన తండ్రి స్నేహితులలో ఒకరైన అమర్‌నాథ్‌తో చిన్నప్పటి నుంచి ఎంతో అనుబంధం ఉందని, ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు కె.సత్రాజు రాజీవ్ గాంధీకి అనువాదకుడిగా తన పేరు సూచించారని, అయితే దీని వెనుక అమర్‌నాథ్ ప్రోద్బలం ఉన్నట్లు తరువాత తెలిసిందన్నారు. 1972 నుంచి అమర్‌నాథ్ జక్కంపూడితో తనతో కలిసి పనిచేశారన్నారు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా, కొన్నిసార్లు ప్రత్యర్థులకు గుచ్చుకునేలా చెప్పేవారన్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ప్రతీ కార్యక్రమంలోనూ నాథ్ పాల్గొనేవారన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ నాన్నకు అత్యంత సన్నిహితులలో అమర్నాథ్ ఒకరిని, కష్ట సమయంలో వారి కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా నిలబడతామన్నారు. రానున్న రోజుల్లో కుంపట్ల అమర్ నాథ్ పేరిట మెమోరియల్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించి క్రీడా రంగానికి ఆయన చేసిన సేవలను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయుడు కృష్ణకుమార్ అధ్యక్షత వహించగా, మాజీ కార్పొరేటర్ ప్రసాదుల హరినాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు పంతం కొండలరావు, నక్కా శ్రీ నగేష్, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, జామీశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులాలకు తగిన ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో పాల్గొన్న రెల్లి సంఘీయులు

సీటీఆర్ఐ: నూతనంగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం రెల్లి కులాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆ కుల రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో భాగంగా 3 శాతానికి పైగా ఉన్న రెల్లి కులాల జనాభాను లెక్క పెట్టడానికి, ప్రభుత్వాలు లెక్కల్లోకి తీసుకోడానికి తమ సంఖ్యను చాలా మేరకు తగ్గించి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు అమలుచేస్తున్న అవకాశాలలో షెడ్యూలు కులాల రిజర్వుడు నియోజక వర్గాల సీట్లు కేటాయింపులలో గానీ, నామినేటెడ్ పదవులలో గానీ ఎలాంటి ప్రాతినిధ్యానికి నోచుకొని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రెల్లి కులాలకి టీడీపీ ప్రభుత్వ పరిపాలనలో ఎమ్మెల్సీ పదవులలోను, షెడ్యూలు కులాల కమిషన్లలోను, ఇతర నామినేటెడ్ పోస్టుల భర్తీలోను ప్రత్యేక అవకాశాలను అందించాలని కోరారు. రెల్లి కులాల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు కేటాయించి, వారి జీవన ప్రమాణాలను పెంచాలని కోరారు. అన్ని విధాలా ఆదుకుని, సామాజిక న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాడుగు కుమార్, రాష్ట్ర కోశాధికారి బంగారు నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులకు ఇంటర్న్‌షిప్ ఉత్తీర్ణత పత్రాలు



ఇంటర్న్ షిప్ ఉత్తీర్ణత పత్రాల అందకున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవపై అవగాహన కలిగి ఉంటే సమాజ అవసరాలు తీర్చవచ్చునని రోటరీ ఇన్నర్ వీల్ పూర్వపు జిల్లా అధ్యక్షురాలు జి.లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. ఆదివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థులకు ఉత్తీర్ణతా పత్రాల అందించే కార్యక్రమంలో జి.లక్ష్మీశ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ అన్నదానం, మహిళలకు కుట్టు, మగ్గం వర్క్‌ల శిక్షణలతోపాటు చదువుతున్న విద్యార్థులకు సమాజ సేవలో ఉచిత సర్టిఫికెట్ కోర్స్ అందించడం అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ వలంటీర్ ఇంటర్న్ షిప్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ పొందిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (పంజాబ్), చండీఘర్ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులకు గత 15 రోజులుగా స్వచ్ఛంద సేవపై వాటి పనితీరుపై అవగాహన తరగతులు నిర్వహించమన్నారు. డిగ్రీ స్థాయిలో వివిధ కోర్సులలో చదువుకుంటున్న వారు సామాజిక సేవపై ఇంటర్న్ షిప్ కోర్సును స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఉచితంగా అందిస్తుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సుమారు 5వేల మంది ఈ ప్రాజెక్టు ద్వారా శిక్షణ పొందారన్నారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 380 మందికి ఈ శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, మేనేజర్ హరికృష్ణ, ఇలియాస్, సురేష్, బద్రి, జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నిరంతర కృషితో బ్యాంకు అభివృద్ధి

మహాజన సభలో ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ అచ్యుత రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న కోళ్ల బాబు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సిబ్బంది నిరంతర కృషితో బ్యాంకును అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లామని ది ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు(బాబు) అన్నారు. ఆదివారం స్థానిక గౌతమ ఘాట్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ కల్యాణ మండపంలో జరిగిన బ్యాంకు 106వ మహాజన సభ ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కోళ్ల బాబు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అభివృద్ధి పథంలో ముందు ఉన్న బ్యాంకుకు ఈ ఏడాది నిరర్థక ఆస్తులు జీరో రావడం సంతోషకరమని వెల్లడించారు. మిగిలిన బ్యాంకుల కంటే అతి తక్కువ సిబ్బందితో ఉన్నప్పటికీ మంచి ఫలితం సాధ్య పడిందన్నారు. తక్కువగా ఉన్న సిబ్బంది బ్యాంకు అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించడం మూలంగా ఇది సాధ్యమైందన్నారు. బ్యాంకు గ్రాస్ బెనిఫిట్ 2.46 శాతం వచ్చిందని, గతంలో 10 శాతంగా ఉన్న డివిడెండ్‌ను 11 శాతానికి పెంచామని తెలిపారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ పాలకోడేటి రమణ కుమార్, బ్యాంకు వైస్‌చైర్మన్ గేడి పోతురాజు, బ్యాంకు డైరెక్టర్లు ఆదిరెడ్డి శ్రీనివాసరావు, అందనా పల్లి సత్యనారాయణ, కటారి శ్రీనివాస్‌కన్నా, నారపురెడ్డి సన్ని, జామి వెంకట రమణ మూర్తి, పాడిపి రెడ్డిశివ, పంచ కట్ల శివ ప్రసాద్, దాది సత్యనారాయణ, గుత్తుల భాస్కర రావు, రెడ్డి సూర్య సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీరాంజనేయులు తదితరులు



ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

సీటీఆర్ఐ: భారతదేశాన్ని విడగొట్టే 370 జీవోను వ్యతిరేకిస్తూ పోరాటం చేసి, ప్రాణాలు వదిలిన మహానాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కృష్ణమాచార్యులు కొనియాడారు. స్థానిక 8వ డివిజన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కన్న కలలను నేటి ప్రధాని నరేంద్ర మోదీ 370 జీఓను రద్దు చేసి నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వీరాజంనేయులు, సావిత్రి, వీరమ్మ, భవాని పాల్గొన్నారు.

కడియం: మండల గ్రామాల్లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు బీజేపీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. మండలంలోని కడియం, దామిరెడ్డిపల్లి, జేగురుపాడు, కడియపుసావరం తదితర గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు పుష్పాంజలి ఘటించారు.

రాజమహేంద్రవరం సిటీ: భారతదేశాన్ని విడగొట్టే 370 జీవోను వ్యతిరేకిస్తూ పోరాటం చేసి భారతసమాఖ్య విఘాతాన్ని అడ్డుకునే ప్రయత్నంలో ప్రాణాలు వదిలిన మహానాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ 42 శక్తి కేంద్ర ప్రముఖ్ కృష్ణమాచార్యులు, జిల్లా బీజేపీ మీడియా ఇన్‌చార్జి వీరాంజనేయులు నివాళులు అర్పించారు.ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖర్జీ కన్న కలలను నేటి ప్రధాని నరేంద్ర మోదీ 370 జీవోను రద్దు చేసి నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొల్లి సావిత్రి ,చిలకల వీరమ్మ, కోడి భవాని పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: జనసంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాతేరు శాంతినగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ యానాపు యేసు, పార్టీనేతలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పార్టీ నేతలు బీవీ రాంబాబు, కండెల రామారావు, ఆకుల నర్సరీవేణి, పెండ్యాల నాగేశ్వరరావు, బి.హేమంత్ కళ్యాణి, బేబీ, దత్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: గోపాలపురం మండలం కొవ్వూరుపాడు గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గుడ్డిగూడెంకు చెందిన ఇద్దరు వ్యక్తులు దొండపూడి మార్కెట్‌కు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వ్యాన్ వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుల వివరాలు తెలియవలసి ఉంది.

యువకుడిపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామానికి చెందిన యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించి వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ ఆదివారం తెలిపారు. కోరుమామిడికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ఆరుగొలను పండు అనే యువకుడు ప్రేమిస్తున్నానని వెంటపడుతూ వేధిస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సినిమాలు



శ్యామల	:	ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్యమినీ	:	నింద
సూర్యప్యాలెస్	:	హరోంహర
స్వామి	:	మహారాజ
శివజ్యోతి	:	ఏ
అనుశ్రీ	:	మనమే
రాజా	:	బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి	:	అంతిమతీర్పు
రంభ	:	కేజీఎఫ్–1
మేనక	:	ప్రేమకథా చిత్రమ్
అప్సర	:	ప్రభుత్వ జూనియర్ కళాశాల
కుమారి	:	హనీమూన్ ఎక్స్‌ప్రెస్
నామవరం		
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	మహరాజ
మురళీకృష్ణ	:	మహారాజ

నగరం జలమయం



జలమయమైన రామచంద్రరావుపేట రోడ్డు



కృష్ణా నగర్ ఏరియా



దేవి చౌక్ నుంచి పేపర్ మిల్లు వెళ్లే రోడ్డు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా దేవీచౌక్, పేపరుమిల్లు ఏరియా, రామచంద్రరావుపేట, ఆదెమ్మదిబ్బ, కోర్లమ్మపేట, కృష్ణారావుపేట, హైటెక్ బస్టాండ్, ఆల్కాట్ తోట, వీఎల్ పురం, జేఎన్‌రోడ్, శ్యామలా సెంటర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. మురుగు కాలువల్లో నీరు ఇళ్లల్లో చేరడంతో తీవ్ర దుర్గంధంతో అవస్థలు పడ్డారు. హైటెక్ బస్టాండ్ ఏరియాలో 3 అడుగుల మేర నీరు నిలిచిపోయింది. బస్సులను దారి మళ్లించారు.